ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 16 ఏప్రిల్ 2024



శుభ కార్యాలయాలకు 'కోడ్' కష్టాలు

- బంగారం, వస్త్రాల కొనుగోళ్లు తప్పనిసరి
- నగదు తీసుకెళ్లాలంటే తనిఖీల బెడద
- ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేమి
- ఆస్పత్రులకూ వెళ్లేటప్పుడూ ఇబ్బందులే

ఇది శుభకార్యాల సీజను. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు వంటివాటికి ముహూర్తాలు అధికంగా ఉండటంతో కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు కళకళలాడుతున్నాయి. అయితే శుభకార్యాలు చేయాలనుకున్న వారికి ఎన్నికల కోడ్‌తో కష్టాలు తప్పడంలేదు. ప్రస్తుతం ఎక్కడికక్కడ వాహనాల తనిఖీలు చేస్తున్నారు. బంగారం, వస్త్రాలు, ఫర్నిచర్ కొనుగోలుకు నగదు తీసుకెళుతుంటే, తనిఖీలతో స్వాధీనం చేసుకుంటున్నారు. ఆ నగదును వెనక్కు తీసుకోవడానికి నిర్వాహకులకు తలప్రాణం తోకకొస్తోంది. శుభకార్యాలకు సడలింపులుంటాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దాంతో ఈ సమయంలో ఇలాంటి కార్యాలు ఎందుకు పెట్టుకున్నామా అంటూ నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు.

- చిత్తూరు

జిల్లాలో శుభ ముహూర్తాలు ఉండటంతో పెళ్లిళ్లు అధికంగా పెట్టుకుంటున్నారు. అలాగే గృహ ప్రవేశాలు కూడా ఉన్నాయి. ఈ నెల 18, 19, 20, 21, 24, 26, 27 తేదీల్లో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. చిత్తూరుతో పాటు జిల్లా అంతటా పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరగనున్నాయి. ఈ నెల 27 తరువాత ముహూర్తాలు లేకపోవడంతో మరో మూడు నెలల ఆగాల్సి ఉన్నందున ఆ లోపు గృహ ప్రవేశాలు, నామకరణాలు, శంకుస్థాపనలు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇటీవల శుభ కార్యాలకు కానుకలు ఇచ్చే అలవాటు బాగా పెరిగింది. ఇక పెళ్లంటే నగలు, వస్త్రాలతో పాటు కల్యాణ మండపాలకు అడ్వాన్సులు ఇవ్వాలి. ఫొటో, వీడియో, డేకరేషన్, క్యాటరింగ్ తదితరాలను ముందుగానే మాట్లాడుకుని అడ్వాన్సులు ఇవ్వాలి. ఇందులో ఒకటీ రెండు మినహా మిగిలన్నింటికీ లక్షల్లోనే చెల్లింపులు చేయడానికి డబ్బులు తీసుకుని వెళ్లాలి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత నెల 16 నుంచి కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో చెక్‌పోస్టుల్లో, మార్గమధ్యలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు రూ.50వేలకు మించి నగదు దొరికితే సీజ్ చేస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు పోవడంతో పాటు సీజ్ చేసిన డబ్బులకు ఆధారాలుచూపి వెనుక్కు తీసుకునే సరికి చుక్కలు కనిపిస్తున్నాయి. కొంత మంది మాత్రం మొబైల్ నెట్ బ్యాకింగ్ ద్వారా లావాదేవీలు జరుపుతున్నప్పటికీ చాలా మంది నగదు ద్వారానే లావాదేవీలు చేస్తున్నారు. చాలా మంది ఇళ్లల్లో ఏళ్ల తరబడి శుభకార్యాలు జరగకుండా లేక లేక కుదరడంతో కొనుగోళ్లకు బయలుదేరితే తీరా పోలీసు స్టేషన్‌కు చేరాల్సి వస్తోంది.



- ఐరాల మండలానికి చెందిన దామోదర్ నాయుడు తన కుమారుడి పెళ్లి కోసం యాదమరిలో ఉన్న బంధువుల నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని బయలుదేరారు. కాణిపాకం క్రాస్‌లో పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. తన కుమారుడి వివాహానికి అప్పు తీసుకుని వెళుతున్నానని మొత్తుకున్నా పోలీసులు వినిపించుకోలేదు. ఆ డబ్బులకు సంబంధించి రికార్డులు చూపించిన వారం రోజుల తరువాత రకరకాల కాగితాల్లో సంతకాలు పెట్టించుకుని డబ్బులను ఇచ్చారు.
- కృష్ణా జిల్లా పోరంకికి చెందిన ఫణీంద్ర ఆర్థికంగా మంచి స్థానంలో ఉండటంతో బెంగళూరులో తక్కువ ధరకు వెండి దొరుకుంతుందంటే రూ.12లక్షల విలువైన వెండి ఆభరణాలను తీసుకొస్తున్నారు. చిత్తూరులో పోలీసుల తనిఖీల్లో వెండి ఆభరణాలను పట్టుకున్నారు. బిల్లులు చూపించి తీసుకెళ్లమని చెప్పడంతో చేసేదేమి లేక ఆయన వెళ్లిపోయారు.
- చిత్తూరు నగరానికి చెందిన ఆయిల్ వ్యాపారి అమీద్, బియ్యం వ్యాపారి షణ్ముగం కలిసి ఈ నెల 10వ తేది బ్యాంకు నుంచి అవసరాల నిమిత్తం రూ. 7.86 లక్షలను డ్రా చేసుకున్నారు. ఈ మొత్తాన్ని తీసుకుని వెళుతుండగా గాంధీ రోడ్డులో పోలీసుల తనిఖీల్లో ఈ నగదు పట్టుకున్నారు. రికార్డులన్నీ చూపించాక.. మూడు రోజుల తరువాత సీజ్ చేసిన డబ్బులను తిరిగి ఇచ్చారు. దీంతో తాము తీసుకొస్తున్న నగదు అత్యవసరానికి ఉపయోగపడటం లేదని పలువురు అంటున్నారు.

రూ.2.29 కోట్ల సీజ్

ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఈ నెల 11వ తేది వరకు జిల్లాలో రూ.2.29కోట్ల నగదు సీజ్ చేశారు. అలాగే, సీజ్ చేసిన బంగారం, వెండి, కుక్కర్లు, బియ్యం, డ్రెస్ మెటీరియల్ విలువ రూ.రూ.2.18 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

స్పష్టత లేని నిబంధనలు

చట్ట ప్రకారం రూ. 50వేలకు మించి నగదు చెల్లింపులకు పాన్ కార్డు ఉండాలి. తనిఖీల్లో రూ.50వేలకు మించి నగదు ఉంటే లెక్కలు చెప్పాలని అధికారులు అంటున్నారు. అదే అధికారులు రూ. 10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయపన్నుశాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగిస్తామంటున్నారు. మరోవైపు రూ.5 లక్షల వరకు పర్వాలేదని చెబుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో పోలీసులకు రూ. 50వేలు దొరికితే పోలీసు స్టేషన్లకు తీసుకెళుతున్నారు. ఆ నగదును ఆధారాలు చూపించి వెనుక్కు తీసుకోవడానికి రోజులు పడుతున్నాయి. పెళ్లి కార్డులు చూపిస్తే వదిలేస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ.. చాలా వరకు పెళ్లిళ్లకు 15 రోజులు ముందు మాత్రమే పత్రికలు ముద్రిస్తారు. కాని నగలు, ఇతర వస్తువులను నెల రోజుల ముందు నుంచే కొనుగోలు చేయాల్సి ఉంది. డబ్బులు తీసుకొని వెళ్లేవారంతా పెళ్లిపత్రికలను వెంట తీసుకెళ్లడం కుదరదు. షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి సామాన్యులను, ఆస్పత్రి ఖర్చులకు, శుభకార్యాలకో డబ్బులు తీసుకొని వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. భారీ మొత్తంలో నగదు దొరికితే చట్ట ప్రకారం వ్యవహరించాల్సిందే. అయితే రూ. 2 లక్షలో మూడు లక్షలో తీసుకెళ్ళేవారిని నిబంధనల పేరిట వేధించడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బిల్లులు ఉంటే వెంటనే రిలీజ్



ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనల ప్రకారం పనిచేస్తున్నాం. రైతులు, సామాన్యులు శుభ కార్యాలు, ఇతర వాటికి డబ్బులు తీసుకొస్తే వాటికి సంబంధించిన ఆధారాలు కూడా తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే అప్పటికప్పుడు నగదును ఇచ్చేస్తాం. పెద్ద మొత్తంలో డబ్బులు, బంగారం, వెండి తదితర వస్తువులు తెస్తే బిల్లులుంటే ఇచ్చేస్తాం. లేదంటే ఖజానా శాఖలో డిపాజిట్ చేస్తాం. సరైన రికార్డులు చూపించిన తరువాత విడుదల చేస్తాం. - ఎస్పీ మణికంత చందోలు

రేపు ఎన్నికల పరిశీలకుల రాక



జిల్లా అధికారుల సమావేశంలో సూచనలిస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు బుధవారం జిల్లాకు రానున్నారని కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆర్వోలు, ఏఆర్వోలు, నోడల్ అధికారులు ఎన్నికల్లో నిర్వహించవలసిన వివిధ అంశాలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల పరిశీలకులు వచ్చేలోగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన రిక్వెస్ట్ పర్మిషన్లను పూర్తి వివరాలతో సిద్ధంగా ఉంచుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సున్నిత, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాల్లో వున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, అక్కడ వెబ్‌కాస్టింగ్, వీడియో కవరేజ్, మైక్రో పరిశీలకులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న పీవో, ఏపీవోలకు మే3న, ఓపీవోలకు 4న, పోలీసులు, మైక్రోఅబ్జర్వర్లకు 5న, డ్రైవర్లు, ఇతర సిబ్బందికి 6న పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వారికి కేటాయించిన నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్వోలచే ఇస్తారన్నారు. ఏడు నియోజకవర్గాలతో పాటు చిత్తూరు పార్లమెంటుకు సంబంధించి నియోజకవర్గాలవారీ బాక్సులు అక్కడే ఏర్పాటు చేయడం జరుగుతుందని, అక్కడే ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. 1266 పోలింగ్ కేంద్రాల లొకేషన్లలో వీల్‌చైర్లను, బారికేడ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రచారాల్లో అభ్యర్థులు ఎక్కువ శబ్దంతో కూడిన వాహనాలను వినియోగిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని, అట్టి వాహనాలను వెంటనే సీజ్ చేయాలని కలెక్టర్ ఆర్వోలను ఆదేశించారు. ఇంటింటి ప్రచారాలకు ముందస్తుగా ఎలాంటి అనుమతులు అవసరం లేదని, కానీ ఆ ప్రచారాల గురించి ముందుగా స్థానిక పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకేసారి పలుపార్టీలు అదే ప్రాంతంలో ఇంటింటి ప్రచారాలకు వెళితే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయని ఆయన గుర్తుచేశారు.

మే 15 తర్వాత జాతరలు

ఏటా గ్రామాల్లో గ్రామదేవత మొక్కుబడులు చెల్లిస్తూ జిల్లాలో నిర్వహించే గంగజాతర్లను ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో మేనెల 10లోగా లేదా మే 15వ తేదీ తర్వాత నిర్వాహకులు నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందుకు సంబంధించి సమీప పోలీసు స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని చెప్పారు. రహదారులను బ్లాక్ చేయడం, ప్రభుత్వ స్థలాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు ఏర్పాటు చేయకుండా భక్తిశ్రద్ధల మధ్య ఎలాంటి ఇబ్బందులు లేకుండా గంగజాతర్లను నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, విశ్రాంత జేసీ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె ఎంపీడీవోకు నోటీసులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15: నోడల్ అధికారి ఇంట్లో అనధికార సోదాలు చేసి, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసిన బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేష్‌కు సోమవారం కలెక్టర్ షన్మోహన్ నోటీసులు జారీ చేశారు. జడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి సంబంధించి విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన ఫైళ్లు అప్పట్లో మాయమై విచారణ కూడా ఆగిన విషయం విదితమే. ఆ ఫైళ్ల కోసం జడ్పీ మాజీ అధికారి ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లె ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేష్ పలమనేరులోని నోడల్ అధికారి బాలాజీ ఇంట్లో అనధికారికంగా సోదాలు చేసి భయభ్రాంతులకు గురిచేసిన విషయం వెలుగు చూసింది. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేష్ చేసిన దుశ్చర్యపై ఆయన నోటీసులు జారీ చేశారు.

విచారణ నేటికి వాయిదా

జడ్పీ సమావేశ మందిర నిర్మాణంపై జరుగుతున్న విచారణ మంగళవారానికి వాయిదా పడింది. అప్పట్లో ఫైళ్లు మాయమైన కారణంగా ఈ నెల 15వ తేదీకి విచారణను జేసీ శ్రీనివాసులు వాయిదా వేశారు. అయితే సోమవారం జరగాల్సిన విచారణను కూడా మంగళవారానికి వాయిదా వేసినట్లు విచారణ అధికారి తెలిపారు.

మళ్లీ పెరిగిన ఎండలు

- అత్యధికంగా పులిచెర్లలో 40.3 డిగ్రీల నమోదు



బోసిపోయి వున్న గాంధీ సర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15: భానుడి ప్రతాపంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం 9 గంటలు దాటితే బయటకు రావడానికి భయపడుతున్నారు. జిల్లాలో తిరిగి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు అటుఇటుగా నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతతో అన్ని రకాల మార్కెట్లు వెలవెలపోతున్నాయి. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మండలాల వారీగా సోమవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు.. పులిచెర్లలో 40.3, శ్రీరంగరాజపురంలో 40.0, తవణంపల్లెలో 39.0, కుప్పం, నగరి, విజయపురంలో 38.8, నింద్ర, పుంగనూరులో 38.6, గుడిపాలలో 38.5, కార్వేటినగరం, సదుంలో 38.4, చిత్తూరులో 38.2, గుడుపల్లెలో 37.8, చౌడేపల్లె, రొంపిచెర్ల, శాంతిపురం, సోమల, పాలసముద్రం, యాదమరిలో 37.5 గంగాధరనెల్లూరులో 37.4, పెనుమూరు, పలమనేరులో 37.3, బంగారుపాళ్యంలో 37.2, వెదురుకుప్పంలో 37.1, పెద్దపంజాణిలో 36.4, పూతలపట్టులో 36.0, గంగవరం, ఐరాల, వి.కోటలో 35.5, బైరెడ్డిపల్లె, రామకుప్పంలో 34.9 డిగ్రీల వంతున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



పలమనేరులో షర్మిల సభకు తరలివచ్చిన జనం

• నారాయణస్వామి లిక్కర్ బాటిల్ మంత్రి



బంగారుపాళ్యంలో సోమవారం రాత్రి జరిగిన సభలో అభివాదం చేస్తున్న షర్మిల

- నాసిరకం మద్యం అమ్మించడంతో పెరిగిన మరణాలు
- వెంకటేగౌడకు మరోసారి ఓటేస్తే ప్రజల్నీ అమ్మేస్తాడు
- ఎన్నికల సభల్లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శ
- కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఓటర్లకు పిలుపు

పలమనేరు/బంగారుపాళ్యం/కార్వేటినగరం, ఏప్రిల్ 15: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మీద పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఆగ్రహించారు. కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యంలలో ఆమె పర్యటన సాగింది. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, ఇద్దరు ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

కార్వేటినగరం సభలో..

'జగన్‌తో పాటు నారాయణస్వామికి ఓట్లేసి గెలిపించారు. ఆయన డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ మినిస్టర్ అంట కదా.. అంటే ఏమిటో తెలుసా.. లిక్కర్ బాటిల్ మంత్రి. లిక్కర్ షాపుల్లో భూం భూం, స్పెషల్ స్టేటస్, ప్రెసిడెంట్ మెడల్ అన్నీ ఈయనవే అంట కదా. బాగా సంపాదించారు. దళితుడు. అంబేడ్కర్ శిష్యుడ్ని అని చెప్పుకుంటాడు కదా. అంబేడ్కర్ ఆశయాలను నిలబెట్టడం అంటే మద్యం అమ్మడమా.. అది కూడా కల్తీ మద్యం అమ్మడమా.. నాసిరకం మందుతో మిగతా రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో 25 శాతం ఎక్కువ మంది కిడ్నీలు, లివర్లు చెడిపోయి చనిపోతున్నారు. అయినా అవే నాసిరకం మద్యం అమ్మకాలు. బయట క్వార్టర్ బాటిల్ రూ.60 అయితే, మన వద్ద రూ.250 అమ్ముతున్నారు. నిజమేనా?' అని జనాన్ని అడిగారు. వారి నుంచి సమాధానాలు రాబట్టారు.

పలమనేరు సభలో..

'మీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరిపాలన ఎలా ఉంది? ఎప్పుడైనా వస్తున్నారా? సమస్యల్ని పరిష్కరిస్తున్నారా? మీరు ఓటేసి గెలిపిస్తే నెత్తి మీద టోపీ పెట్టారు. ఇసుక, మట్టి మాఫియాతో బాగా సంపాదించారు. నదిలో ఇసుక లేకుండా మొత్తం అమ్ముకున్నాడట కదా. మరోసారి ఓటేస్తే మిమ్మల్ని కూడా అమ్మేస్తాడు. నియోజకవర్గంలోని భూముల్ని, ప్రజల్ని మొత్తంగా అమ్మేస్తాడు' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బంగారుపాళ్యం సభలో..

'ఈసారి ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ అభ్యర్థులు బాగా డబ్బులిస్తారు. ఎవరు డబ్బిచ్చినా తీసుకోండి. కానీ ఓటు మాత్రం మనస్సాక్షి మేరకు వేయండి. ఓటు తల్లి, చెల్లి లాంటిది. అమ్ముకోకండి. జగన్ చెప్పిన వాగ్దానాలన్నీ మద్యం షాపుల్లో నిలబెట్టుకున్నారు. అమ్మఒడి ఇద్దరికి ఇస్తానని ఒకరికే ఇస్తున్నారు. మరోబిడ్డను దత్తత ఇచ్చేయాలా? చంపేసుకోవాలా? పులి కడుపున పులే పుడుతుంది. నా గుండెల్లో నిజాయితీ ఉంది. గెలిపించండి. వైఎస్సార్ సంక్షేమాన్ని తెస్తాను' అని జనానికి హామీలిచ్చారు.

అభ్యర్థులను గెలిపించమని..

కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో జరిగిన బహిరంగ సభల్లో జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు రమేష్‌బాబు, శివశంకర్, ఎంఎస్ బాబులను పరిచయం చేశారు. ఓట్లేసి గెలిపించాలని, అందుబాటులో ఉండి సమస్యల్ని పరిష్కరిస్తారని కోరారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, బంగారుపాళ్యంలో వామపక్ష నాయకులు ప్రసంగించారు.

కరచాలనాలు.. ఆత్మీయ పలకరింపులు



ప్రతి సభలోనూ పదే పదే 'హస్తం గుర్తుకు ఓటేయండి. హస్తం గుర్తును మర్చిపోకండి' అంటూ షర్మిల కోరుతూ హస్తం గుర్తును ఫ్లకార్డును చేత్తో పట్టుకుని చూపించారు. ఆశీర్వదించండి అంటూ పదే పదే కోరారు. రొటీన్‌గా ప్రసంగించకుండా హాజరైన వారిని ప్రశ్నలడిగి జవాబులు చెప్పించారు. మూడు సభల్లోనూ పెద్దఎత్తున షర్మిలను చూసేందుకు, ఆమె ప్రసంగం వినేందుకు ప్రజలు తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు, ముస్లింలు అధిక సంఖ్యలో కనిపించారు. ముఖ్యంగా మహిళలు భుజాన కాంగ్రెస్ జెండా కర్ర వేసుకుని ఉత్సాహంతో తిరిగారు.



పలమనేరులో జనంతో కలిసి ముందుకు సాగుతూ..

కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ సోమవారం కార్వేటినగరంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్వహించిన రోడ్డు షోలో పాల్గొన్న జనం



బంగారుపాళ్యంలో షర్మిల సభలో పాల్గొన్న ప్రజలు



లీసెస్టర్ వర్సిటీతో అపోలో ఒప్పందం



అపోలో, లీసెస్టర్ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఒప్పందాన్ని చూపుతున్న ప్రతినిధులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15: యూకేలోని లీసెస్టర్ యూనివర్సిటీతో చిత్తూరు అపోలో వర్సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. లీసెస్టర్‌తో కలిసి అపోలో యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన క్రమంలో సోమవారం ఈ వర్సిటీలు ఒప్పంద కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా అపోలో వర్సిటీ వీసీ వినోద్‌భట్ మాట్లాడుతూ.. యూకే, భారతదేశాల మధ్య విద్య, పరిశోధన రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడానికి రెండు యూనివర్సిటీలు జతకట్టాయన్నారు. ఇందులో భాగంగా రెండు సంస్థలు ఒక కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు వివరించారు ఈ కార్యక్రమం ద్వారా చిత్తూరులోని అపోలోలో రెండు సంవత్సరాల కోర్సు చేశాక.. చివరి సంవత్సరం లీసెస్టర్‌లో కోర్సును పూర్తి చేసి ఆ యూనివర్సిటీ పేరుతోనే పట్టా పొందవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో విదేశీ విద్యను పొందవచ్చని తెలిపారు. అపోలో యూనిట్ హెడ్ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. మొదటగా 120 మంది విద్యార్థులతో ఈ కోర్సును ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. బోర్డు నుంచి ఎంపీసీ, డిప్లొమా కోర్సులో 50 శాతంమార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు నేరుగా అడ్మిషన్లు పొందవచ్చన్నారు. చదువు కోసం అపోలో సంస్థ ఆధ్వర్యంలో బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తుందన్నారు. హెల్త్ కేర్, డేటా సైన్స్ రంగాలలో విద్యా, పరిశోధన శక్తిని ఉపయోగించి వాస్తవిక ప్రపంచంలో మార్పులు తీసుకురావాలన్నది తమ భాగస్వామ్య లక్ష్యమని లీసెస్టర్ వీసీ హన్రిట్టా ఓ కానర్ పేర్కొన్నారు. లిసెస్టర్ డిప్యూటీ వైస్ చాన్సలర్ కెర్రీలా, అపోలో రిజిస్ట్రార్ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాల అడ్డుకట్టకు బీట్ వ్యవస్థలను బలోపేతం చేయాలి

● జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15: నేరాల అడ్డుకట్టకు రాత్రి, పగలు వేళల్లో పోలీస్ సిబ్బంది ద్వారా పర్యవేక్షిస్తున్న బీట్ వ్యవస్థలను ఎప్పటికప్పుడు బలోపేతం చేయాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పోలీస్ అధికారుల ను ఆదేశించారు. గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన రోడ్డుప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు తదితర కేసుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల వివరాలు, నిందితుల అరెస్ట్, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై ఆరాతీశారు. కేసులను త్వరితగతిన విచారణ పూర్తిచేసి నిర్దేశిత కాలవ్యవధిలో కోర్టులో చార్జిషీట్ ఫైల్‌చేసి నిందితులకు కఠినశిక్షపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్లలో పనిచేసే సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో గంగాధరనెల్లూరు సీఐ శంకర్, ఏఎస్ఐ ఆంజనేయులురెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన దూరవిద్య డిగ్రీ మొదటి సంవత్సరం (బీఏ, బీకాం, బీఎస్సీ) ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సతీష్ (ఫైల్ ఫొటో)

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15: మదనపల్లె- బోయకొండ మార్గంలోని కృష్ణాపురం సమీపంలో ఆదివారం రాత్రి ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామానికి చెందిన గంగులప్ప కుమారుడు సతీష్(25) కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించేవాడు. ఆదివారం మదనపల్లెకు ద్విచక్రవాహనంలో కూలీ పనులకు వెళ్లి రాత్రి స్వగ్రామానికి వెళుతుండగా కృష్ణాపురం వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి శవపరీక్ష కోసం తరలించారు.

5లీటర్ల నాటుసారా సీజ్



పట్టుబడిన ఊటతో పోలీసులు

పెనుమూరు 15: పెనుమూరు మండలం కామ చిన్నయ్యపల్లి పంచాయతీ మిట్టూరు గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో నాటు సారా తయారీ స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ కథనం మేరకు.. తమకు అందిన సమాచారంతో సోమవారం మెట్రో గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఐదు లీటర్ల నాటుసారా, సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల ఊటను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు.

దొంగని చితకబాదిన జనం



యువకుడిని కట్టేసి ప్రశ్నిస్తున్న జనం

కుప్పం, ఏప్రిల్ 15: కుప్పం పురపాలక సంఘం పరిధి ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఒక మహిళ మెడలోనుంచి ఒక యువకుడు బంగారు గొలుసు దొంగతనం చేయబోయాడు. దీన్ని గుర్తించిన స్థానికులు కొందరు అతడిని పట్టుకుని పక్కనే ఉన్న విద్యుత్తు స్తంభానికి కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారమచ్చి వారికి అప్పగించారు.

ఎన్నికల వివరాలతో సిద్ధంగా ఉండండి

● లైజన్ ఆఫీసర్లకు జేసీ సూచన



లైజన్ ఆఫీసర్లతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లాకు నియమితులైన ఎన్నికల పరిశీలకులు త్వరలో రానున్నారని, వారికి అవసరమైన ఎన్నికల సమగ్ర వివరాలతో సిద్ధంగా ఉండాలని లైజన్ ఆఫీసర్లను జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం సాయంత్రం జేసీ సమావేశ హాలులో ఎన్నికల పరిశీలకుల నోడల్ ఆఫీసర్, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డితో కలిసి జేసీ సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు నియోజకవర్గాల్లో పర్యటించే సమయంలో వారికి సంబంధించి ఎప్పటికప్పుడు వ్యయ వివరాలతో కూడిన నివేదికలను అందజేస్తుండాలన్నారు. ముందస్తుగా ఎన్నికల పరిశీలకులతో వారి రోజువారి పర్యటన వివరాలను తెలుసుకుని ఆ ప్రాంతాలకు వారితో వెళ్ళాలని ఆయన సూచించారు.

తగ్గిన టమోటా ధరలు

సోమల, ఏప్రిల్ 15: టమోటా ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. సోమవారం 15కిలోల బాక్సు ధర మొదటి రకం రూ.150, 180 వరకు పలికింది. రెండో రకం రూ.100లోపు, పొడి కాయలు రూ.50లోపు ధరలున్నాయి. దిగుబడులు భారీగా పెరగడం ఇతర ప్రాంతాలకు ఎగుమతులు లేకపోవడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయని వ్యాపారస్తులు తెలిపారు. వారం కిందట 15కిలోల బాక్సు రూ.250కి మించి పలికింది. కిలో రూ.10కి చేరుకోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. సోమల మండలంలో ఒక్కో రైతు 3 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పలువురు వలస రైతులు మండలంలో భూములు లీజుకు తీసుకొని టమోటా సాగు చేశారు. ఎకరా టమోటా సాగుకు రూ. 1.50 లక్షలకు మించి పెట్టుబడులు పెట్టారు. ధరలు తగ్గుముఖం పడుతుండటంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు.

ఏపీ పునర్నిర్మాణం బాబుతోనే సాధ్యం

- ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు



కరపత్రాలను విడుదల చేస్తున్న రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు తదితరులు

పలమనేరు, ఏప్రిల్ 15 : ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం చంద్రబాబుతోనే సాధ్యమని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ చైర్మన్ పూర్ణచంద్రారావు పేర్కొన్నారు. సోమవారం పలమనేరులోని మాజీ మంత్రి అమరనాథరెడ్డి స్వగృహంలో బాబుగెలుపు- పెన్షనర్ల పిలుపు పేరుతో కరపత్రాలను అమరనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజన జరిగి రాష్ట్రంలో తీవ్ర ఆర్థిక లోటు ఉన్నా ఆనాడు చంద్రబాబు 43 శాతం ఫిట్‌మెంట్‌తో 10వ పీఆర్సీ ఇవ్వడం, 10 నెలల పీఆర్సీ అరియర్స్ రూ.2వేల కోట్లు పెన్షనర్లకు చెల్లించారన్నారు. ఉద్యోగులకు రిటైర్‌మెంట్ తేదీకి 15రోజులు ముందుగానే ట్రెజరీలో బిలులు సబ్మిట్‌కు అనుమతించేందుకు ప్రత్యేక జీఓ ఇచ్చి రిటైరు అయిన నాడే పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్, గ్రూపు ఇన్సూరెన్సు, జీపీఎఫ్, ఎర్న్‌లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించి సగౌరవంగా ఉద్యోగులను ఇంటికి పంపేవారన్నారు. 2019 నుంచి 2024 మధ్య పెన్షనర్ల పరిస్థితి గమనిస్తే 1వ తేదిన పెన్షన్‌రాక టెన్షన్ పడుతూ 10వ తేది నుంచి 20వ తేది వరకు ఎదురుచూస్తూ పెన్షన్ వస్తే చాలు అనే స్థాయికి వచ్చామన్నారు. ప్రజాశ్రేయస్సు దృష్ట్యా చంద్రబాబు నేతృత్వంలోని అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ కన్వీనర్ గురవయ్య, కోర్డినేటర్ విస్‌డమ్ చౌదరి, చిత్తూరు జిల్లా అధ్యక్షులు కృష్ణమనాయుడు, పంచాయితీరాజ్ రిటైర్డు ఇంజినీరింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంజినేయులు, జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి కోదండ యాదవ్, మీడియా కోఆర్డినేటర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి పంపాలి

అధికారం రావడానికి ప్రధాన కారణమైన ఉద్యోగులను కూడా జగన్ రెడ్డి మోసం చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు జగన్‌ను ఇంటికి సాగనంపితేనే రాష్ట్రభవిష్యత్ సాధ్యమని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులతో పాటు సామాన్యులకు ఇచ్చిన హామీలను జగన్ తుంగలో తొక్కారని, తన మోసపూరిత హామీలతో అందరిని మోసంచేశారన్నారు. నేడు సంక్షోభంలో కూరుకు పోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడానికి చంద్రబాబును గెలిపించుకోవాలసిన అందరిపై వుందని ఆయన పిలుపు నిచ్చారు.

తీరుమారని రక్త పరీక్ష కేంద్రం సిబ్బంది

● రిపోర్టుల కోసం గంటల తరబడి రోగుల నిరీక్షణ



రిపోర్టుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 15 : రుయాస్పత్రిలోని రక్త పరీక్ష కేంద్రం పనితీరు మారడం లేదు. ఇటీవల ఒక రోగికి తప్పుడు నివేదికలు ఇచ్చి విమర్శల పాలైన సిబ్బందిలో ఎటువంటి మార్పూ కనిపించడం లేదు. వైద్యం కోసం వచ్చిన రోగులకు 13 నంబరు గదిలో రక్త పరీక్షలు చేస్తారు. ఉదయం 7 గంటల నుంచి చేసిన పరీక్షల రిపోర్టులను మధ్యాహ్నం మూడులోపు ఇవ్వాలి. వాటిని తీసుకుని రోగులు డాక్టర్లకు చూపించుకుంటారు. అయితే మధ్యాహ్నం 2 గంటల తర్వాత గది తెరిచి 2.30 గంటల లోపు మూసేస్తున్నారు. దీంతో సకాలంలో రిపోర్టులు తీసుకోలేక రోగులు మరుసటి రోజు మళ్లీ రావాల్సి వస్తోంది. సోమవారమూ ఇదే పరిస్థితి కనిపించింది. దీనిపై రుయా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పసిడి పరుగులు

- నెల రోజుల్లోనే గ్రాముపై రూ.1,200 పెరిగింది



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: బంగారం ధర అమాంతం పెరుగుతోంది. నెల రోజుల వ్యవధిలోనే గ్రాము బంగారంపై రూ.1,200 పెరిగింది. మూడు నెలల వ్యవధిలో 20శాతం పెరుగుదల కనిపించిందని తిరుపతి లోని స్వర్ణ వ్యాపారులు చెబుతున్నారు. మునుపటిలా కాకుండా కరోనా తరువాత ధర పైపైకి ఎగబాకుతూనే ఉంది. 24 క్యారెట్ల బంగాకం నెల కిందట గ్రాము ధర రూ.6,300 ఉండగా, సోమవారం నాటికి రూ.7,500 చేరుకుంది. శుభ ముహూర్తాల వేళ బంగారం ధర పెరగడంపై జనం ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఇన్వెస్టర్లు మాత్రం ఖుషీగా ఉన్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణమే దీనికి కారణంగా వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో దాదాపు 430 బంగారం దుకాణాలుండగా అందులో రోజుకు రూ.6.50 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. తిరుపతిలోనే ఏడు కార్పొరేట్ దుకాణాలున్నాయి. చిన్నా చితకా మరో 154 వరకు షాపులున్నాయి. వీటిల్లో మాత్రమే దాదాపు రూ.3.20కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది.

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము రూ.5,568

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము బంగారం రూ.5,568 వరకు పలికింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1,932 పెరిగి అపరంజి బంగారం ధర రూ.7,500 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,689 చేరుకుంది. ఇంతలా ధరలు పెరగడంతో కొనుగోలుదారు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.

టీడీపీ ప్రచార వాహనంపై 'వైసీపీ' దాడి





చిరిగిపోయిన ఫ్లెక్సీతో ఉన్న టీడీపీ ప్రచార వాహనం - ఎస్ఐతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

పెళ్లకూరు, ఏప్రిల్ 15: టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ కార్యకర్త దాడి చేశాడు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామంలో సోమవారం ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్ల నాగార్జున దాడికి దిగాడు. వాహనానికి కట్టి ఉన్న ఫ్లెక్సీలను కర్రతో కొట్టి చించేశాడు. అనంతరం వాహన డ్రైవర్ నెలవల గోపిపైనా కర్రతో దాడికి యత్నించగా, స్థానికులు నిలువరించారు. దాంతో వాహనాన్ని తీసుకుని డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకుని వచ్చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం వెంటనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు డ్రైవర్ కూడా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని విచారించి, నాగార్జున ఆచూకీపై ఆరా తీశారు. సాయంత్రం స్థానిక టీడీపీ నేతలతో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన వారితోపాటు అతడిని ప్రోత్సహించిన ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధలను అతిక్రమించి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎన్నికల నిబంధనల మేరకు కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మౌనికను అభినందించిన కలెక్టర్



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 15: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానం, జిల్లాలో మొదటి స్థానం సాధించిన కె.ఎం.మౌనికను కలెక్టర్ షన్మోహన్ అభినందించారు. సోమవారం శ్రీవిద్యావికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధుమూర్తి, వైస్ ప్రిన్సిపల్ రాజులతో కలిసి మౌనిక కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థినికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఇంకా జేసీ శ్రీనివాసులు, కమిషనర్ అరుణ కూడా మౌనికను అభినందించారు.

24న దేవాలయ భూముల బహిరంగ వేలం

పుంగనూరు రూరల్, ఏప్రిల్15: ఈనెల 24న పుంగనూరులోని మాణిక్య వరదరాజస్వామి ఆలయానికి సంబంధించిన భూముల్లో ఏడాదిపాటు పంటలు సాగు చేసుకోవడానికి బహిరంగ వేలం వేయనున్నట్లు దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఏకాంబరం తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మేలుపట్ల, చెంగాలాపురం, పుంగనూరు, మేలుందొడ్డి, మార్లపల్లె గ్రామాల్లో ఉన్న భూముల్లో పంట సాగు చేసుకోవడానికి వేలం వేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ఆలయ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు రూ. 500 ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. అలాగే మాణిక్య వరదరాజస్వామి ఆలయం వారిచే ఎద్దుల పరుష ఈనెల 25న నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు రూ. 10వేలు దరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి ఉత్సవాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్15: స్థానిక జమీందారు ప్యాలెస్ ఆవరణలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయ వార్షిక ఉత్సవాలు మంగళవారం నుంచి 26వ తేది వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 16న అంకురార్పణ, 17న ధ్వజారోహణం, సింహవాహనోత్సవం, 18న యాళి వాహనోత్సవం, 19న శేషవాహనోత్సవం, 20న రావణవాహనోత్సవం, 21న నంది వాహనోత్సవం, 22న కళ్యాణోత్సవం, 23న రథోత్సవం, 24న అశ్వవాహనోత్సవం, 25న వసంతోత్సవం, ధ్వజావరోహణం, 26న రుద్రాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పీఈఎస్‌లో టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



కుప్పం, ఏప్రిల్ 15: కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో వార్షిక టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ డాక్టర్స్ ప్రీమియర్ లీగ్ సీజన్-12ను కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.ఆర్.కృష్ణారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 వరకు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో 10 టీమ్‌లు పాల్గొంటున్నాయని చెప్పారు. ఇందులో మెడికల్, అలైడ్ హెల్త్ సైన్సెస్, పీజీ విద్యార్థులు, బోధన బోధనేతర సిబ్బంది క్రీడాకారులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్, క్రీడాకారులు, అన్ని కోర్సుల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు ఉగాది క్యాలెండర్ల పంపిణీ

పలమనేరు, ఏప్రిల్15 : ఉగాది క్యాలెండర్లను సోమవారం ఇక్కడి సమాఖ్య కార్యాలయం వద్ద త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక స్థానికులకు పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ఇందు జ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు వింధ్య, జీవరత్న, జ్యోతి లతో పాటు ఏఎంఓ మొగిలీశ్వరయ్య, కమ్యూనిటి కో ఆర్డినేటర్లు హరి, విజయలక్ష్మి, భువనేశ్వరి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

పలమనేరు, ఏప్రిల్15 : పలమనేరులో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండవరోజు సినిమా థియేటర్లలో పనిచేసే సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అగ్నిమాపక కేంద్ర అధికారి పి. మనోగరన్ అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణ, ఆస్థినష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వారికి తెలియజేశారు. అనంతర కరపత్రాలను కూడా పంచిపెట్టారు.

భిక్షాటన చేస్తున్న మహిళలకు కౌన్సెలింగ్

పలమనేరు, ఏప్రిల్15 : పొరుగు జిల్లాలనుంచి చిన్న పిల్లలను వెంటతీసుకొని వచ్చి పలమనేరు పురవీధుల్లోనూ, బస్టాండు ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న మహిళలకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోమవారం వివిధశాఖల అధికారులు, ఎంఎస్‌కేలు కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 10 మంది చిన్నపిల్లలను, 5 మంది పెద్దలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారు తమ పట్టణానికి వెళ్లిపోతామని చెప్పడంతో వారిని వారి స్వస్థలం కదిరికి పంపించినట్లు ఏఎల్ఎ సీఓ కోఆర్డినేటర్ శివ తెలిపారు. ఐసీడీఎస్ ఎంఎస్‌కే అసిస్టెంట్‌లు మురళి, ఎంఈఓలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పుంగనూరు రూరల్, ఏప్రిల్15: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పుంగనూరు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు కరపత్రాలను పంపిణీ చేశారు. సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఎంబీటీ రోడ్డు, తూర్పుమొగసాల ప్రాంతాల్లో కరపత్రాలు అందిస్తూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువలు తెలియజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ప్రజలను ప్రమాదాలు జరకుండా చైతన్యవంతులు చేయడానికే అగ్నిమాపక వారోత్సావాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి జరగాలంటే టీడీపీని గెలిపించాలి



ఆరడిగుంటలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు, ఏప్రిల్15: రాష్ట్రాభివృద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని పుంగనూరు టీడీపీ నాయకులు కోరారు. సోమవారం మండలంలోని ఆరడిగుంట, సింగిరిగుంట గ్రామ పంచాయతీల్లో టీడీపీ నాయకులు పర్యటించి మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా సర్పంచు, ఎంపీటీసీలను వైసీపీకి అనుకూలంగా ఉన్న నాయకులను ఏకగ్రీవాలు చేసుకుని అభివృద్ధిని మరిచిపోయారని ఆరోపించారు. తిరిగి అధికారంలోకి వస్తే ప్రజలకు ఇబ్బందులు తప్పవని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, రెడ్డెప్పయాదవ్, గంగాధర్, ప్రసాద్, కృష్ణానాయక్, గిరిబాబు, సుబ్రహ్మణ్యం, కవిత, రామకృష్ణ, రెడ్డెప్ప, రమేశ్, శంకర్‌రెడ్డి, మంజునాథ్, జనసేన నాయకులు విరూపాక్షి, హరినాయక్, బాలాజీనాయక్, చైతన్యరాయల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే పుంగనూరు పట్టణం కట్టకిందపాళ్యం, కుమ్మరవీధి, బజార్‌వీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సుబ్రహ్మణ్యంరాజు, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, శ్రీనివాసులు, దేశాధి ప్రకాశ్, సుబ్బన్న, రామయ్య, గాజుల రమణ, జనసేనా నాయకులు పగడాల రమణ, నరేశ్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష ఓట్ల మెజారిటీయే లక్ష్యం : టీడీపీ

కుప్పం, ఏప్రిల్ 15: కుప్పంలో చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీ తేవడమే లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ అన్నారు. కుప్పం 6వ వార్డు పరిధిలోని అనిమిగానిపల్లె, రూరల్ మండలం మహమ్మద్‌పురంలో వారు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాలలో పార్టీలో చేరికలు కూడా జరిగాయి. కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం ఐదేళ్ల వైసీపీ పాలనలో 30 ఏళ్ల వెనక్కు వెళ్లిపోయిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే కుప్పం తిరిగి బాగుపడుడుతుందని, అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి, సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహమ్మద్‌పురంలో చేరికలు

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



చౌడేపల్లె, ఏప్రిల్15: చౌడగానిపల్లెలో సోమవారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయన్నే కలశస్థాపన, పుణ్యాహవచనం, సుచగవ్య ప్రాశనం, అగ్నిప్రతిష్ఠ, నవగ్రహ పూజ, గణపతి హోమం, నవగ్రహ హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 15: పుంగనూరు మండలంలోని మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి ఈనెల 21న పరీక్షలు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమా తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో చేరడానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాల్సివుందన్నారు. ఈనెల 21న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సివుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వి.కోట, ఏప్రిల్ 15: నాయకనేరి-వి.కోట ప్రధాన రహదారిలో ఓటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కుప్పానికి చెందిన శవరణ(28) తన తాత సుబ్రమణ్యం (77)ను తమిళనాడులోని ఎరకంబట్టులో విడిచిపెట్టేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఎదురుగా ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న తాత, మనవడికి కాళ్ళు విరిగడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అంబులెన్స్ ద్వారా వి.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బాధితులను కుప్పం తీసుకెళ్ళారు. వి.కోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరిలో సుబ్రమణ్యం పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాల ద్వారా సమాచారం.

బైక్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

వి.కోట, ఏప్రిల్ 15: వి.కోట జడ్పీ బంగ్లా సమీపంలో రోడ్డు దాటుతున్న ఎర్రినాగేపల్లెకు చెందిన గణేష్ (22)ను సోమవారం మధ్యాహ్నం బైక్ ఢీకొంది. దీంతో యువకుడి తలకు తీవ్రగాయం కావడంతో సమీపంలోని ప్రైవేటు క్లినిక్‌కు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉందనడంతో కుటుంబ సభ్యులు పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. యువకుడు స్థానికంగా గోపాలమిత్రగా విధులు నిర్వహిస్తుండేవాడు. యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ననియాలలో టీడీపీలో చేరిక

రామకుప్పం, ఏప్రిల్ 15: మండలంలోని ననియాలకు చెందిన వైసీపీ యువనేతలు సురేష్, తిమ్మప్పలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం రామకుప్పం పార్టీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారిలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన

రామకుప్పం, ఏప్రిల్ 15: పట్టణంలోని ప్రధాన రహదారి, కల్లుగీత కార్మికుల కాలనీల్లో సోమవారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వైసీపీ పాలనలో రాష్ట్రం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ పాల్గొన్నారు. బైపరెడ్లపల్లెలో తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మండల అధ్యక్షుడు కొళ్ళపల్లిబాబు, నేతలు నరేంద్రరెడ్డి, నవీన్‌లు, కోట్లగూరులో బీసీ సెల్, వాణిజ్య విభాగాల నియోజకవర్గ ప్రధానకార్యదర్శులు వెంకటరమణ, బ్రహ్మానందం, ఐటీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ శంఖారావం కార్యక్రమాలు నిర్వహించారు.

రాములోరి కల్యాణోత్సవం



సదుం, ఏప్రిల్ 15: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ పలకటివారిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి దోపిడీ, దౌర్జన్యాలు ఇక సాగవు

సదుంలో చల్లా బాబు





చింతమాకులపల్లెలో పర్యటిస్తున్న పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, మంగళంపేటలో ప్రచారం నిర్వహిస్తున్న చల్లా పూజారెడ్డి

సదుం, ఏప్రిల్ 15: వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో చేసిన దౌర్జన్యాలు, దోపిడీ, భూకబ్జాలు, అరచాకాలు ఇక సాగవని టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు. సోమవారం పెద్దిరెడ్డి సొంత మండలమైన సదుం మండలం 79ఏ చింతమాకులపల్లె, పాలమంద పంచాయతీల్లోని గ్రామాల్లో చల్లా బాబు ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా దళితులపై దాడులు, భూకబ్జాలు, ప్రతిపక్షాలపై దాడులు, ఇసుక, గనులను దోపిడీ చేసి సహజ వనరులను నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాడిరైతులను దోపిడీ చేస్తూ లీటరు పాలుకు రూ.18 ఇస్తూ మోసం చేస్తున్నారని, త్వరలోనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాగానే, చంద్రబాబునాయుడు సీఎం కాగానే పాల రైతులకు గిట్టుబాటు దర కల్పిస్తామన్నారు. వైసీపీ నేతలకు ఎవరూ భయపడరాదని, తెలుగుదేశం పార్టీ, బీజేపీ, జనసేన పార్టీలు అండగా ఉంటాయని చెప్పారు. అంచెలంచెలుగా పుంగనూరు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, బీజేపీ రాజంపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని చల్లా బాబు కోరారు. సదుం మండలంలో చల్లాబాబుకు గ్రామాల్లో మంగళవాయిద్యాలతో పూలవర్షం కురిపిస్తూ గజమాలలతో ఘనస్వాగతం పలికారు.

మా నాన్నకు ఒక్క అవకాశం ఇవ్వండి

● తండ్రి కోసం చల్లాబాబు కుమార్తె పూజారెడ్డి ప్రచారం

కల్లూరు : పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా నాన్న చల్లా బాబురెడ్డిని గెలిపించి ఒక్క అవకాశం ఇస్తే పుంగనూరు అభివృద్ధి ఏమిటో చేసి చూపిస్తామని చల్లా పూజారెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. పులిచెర్ల మండలం మంగళంపేటలో సోమవారం చల్లా పూజారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మొదటి సారిగా మంగళంపేటకు విచ్చేసిన పూజారెడ్డికి టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు ఘనస్వాగతం పలికారు. కర్పూర హారతులిచ్చి గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రజా స్పందన చూస్తుంటే పుంగనూరులో టీడీపీ విజయం తథ్యమన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలు నిండు మనసుతో చల్లా బాబురెడ్డి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయ నాయుడు, మురళీధర్‌నాయుడు, కుమార్‌రెడ్డి, రామూర్తి, ప్రభాకర్, అల్తాఫ్, సయ్యద్‌బాషా, రియాజ్, గుర్రప్ప, బాస్కర్, సుబ్బరాజు, ఆనందరెడ్డి, డక్కాహరి మునేంద్ర, ఇనయ్‌తుల్లా, నరసింహులు, గోపినాయుడు, మహేష్, ఈఎం రత్నం, అహ్మద్‌బాషా, ప్రసాద్, మురళి, నారాయణస్వామినాయుడు, నజీర్, నాగరాజనాయుడు, సురేష్, పురుషోత్తం, దేవ, రాజేష్, శంకర్, రవి, నూర్‌బాషా, మోహన్‌దాస్, బాబయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే బీసీవై పార్టీ ధ్యేయం





పులిచెర్ల మండలం కావేటివారిపల్లెలో రైతుకు మేనిఫెస్టో అందిస్తున్న బీసీవైపీ నాయకులు, సదుం మండలం తాటిగుంటపల్లెలో ప్రచారం

కల్లూరు, ఏప్రిల్ 15: భారత చైతన్య యువజన పార్టీ (బీసీవైపీ) ఆవిర్భావమే రైతు సంక్షేమం కోసమేనని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం పులిచెర్ల మండలం కావేటివారిపల్లె, పోశంపల్లె, కొత్తపేట గ్రామాల్లో ఇంటింటా పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీలకు ప్రత్యామ్నాయంగా రైతు అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పార్టీ స్థాపించారని వివరించారు. నియోజకవర్గ కేంద్రమైన పుంగనూరులో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. గత ఎన్నికల తర్వాత నుంచి అధికార వైసీపీ ఆగడాలు, రైతు, ప్రజా సమస్యలపై పోరాడుతున్న రామచంద్రయాదవ్‌ను ప్రజలు ఆదరించి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలను అంతం చేయడానికి ప్రజలు ఆలోచించి చెరుకు రైతు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలు, మహిళలు, రైతులకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, హర్ష, నక్కా ఈశ్వర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఉచితంగా పాడి ఆవు

సదుం, ఏప్రిల్ 15: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలోని ప్రతి రైతు కుటుంబానికి ఉచితంగా పాడి ఆవు అందిస్తారని ఆ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. సోమవారం సదుం మండలం తాటిగుంటపల్లె, చింతపర్తివారిపల్లె, కంభంవారిపల్లె, ఊటుపల్లె పంచాయతీల్లోని గ్రామాల్లో వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా బీసీవై పార్టీ నాయకులు మాట్లాడుతూ పుంగనూరు అభివృద్ధి, సంక్షేమం, యువతకు ఉపాధి, రైతుల సంక్షేమం, వైసీపీ ఆగడాలు, దౌర్జన్యాలు అంతం చేయడానికి ప్రజలు చెరుకు రైతు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పాడిరైతులకు త్వరలో మంచి జరుగుతుందని, పాలు, మామిడి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించడం, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పాల డెయిరీలు ఏర్పాటు చేసి రైతుల దోపిడీని బీసీవైపీ అడ్డుకోవడం జరుగుతుందన్నారు. రామచంద్రయాదవ్‌కు ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమో ప్రజలకు చూపిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో బీసీవైపీ నాయకులు ఆనందరెడ్డి, విశ్వనాథరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గంగాధర్ యాదవ్, రమేశ్, ఆనంద్, సురేంద్రయాదవ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో : కాంగ్రెస్



షర్మిలతో కలిసి ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్

పలమనేరు, ఏప్రిల్15 : పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి తాను ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించానని కాంగ్రెస్ అభ్యర్థి బి. శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల చేపట్టిన ఏపీ న్యాయ్ యాత్ర పలమనేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలమనేరు టవర్ క్లాక్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో శివశంకర్ మాట్లాడుతూ పలమనేరును గత పాలకులు గానీ, ఇప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ గాని అభివృద్ధి చేయలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు తమకు రోజల తరబడి నీళ్లురాలేదని చెబుతున్నారన్నారు. పశువులకు మేత లేక రైతులు కబేళాలకు అమ్ముకొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు టీడీపీ, వైసీపీ పాలన పట్ల విసిగి వేసారి పోయారని, రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రెండేళ్లక్రితం పలమనేరు సమీపంలోని కౌండిన్య పొంగి పారిందని, అందులోని ఇసుకను నేతలు తరలించడంతో నేడు తాగునీటి సమస్య నెలకొందన్నారు.జిల్లా సీపీఐ నాయకుడు వాడ గంగరాజు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాను షర్మిల తీసుకొస్తుందన్నారు. సీపీఎం నాయకుడు ఓబుల్ రాజు మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని సాగనంపాలని, అప్పుడే మైనారిటీలకు రక్షణ ఉంటుందన్నారు. సీపీఐ నాయకులు సుబ్రమణ్యం మాట్లాడుతూ శివశంకర్‌ను గెలిపించి పలమనేరు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రసంగిస్తూ కిందకు దూకేసిన శివశంకర్

పలమనేరులో సోమవారం సాయంత్రం జరిగిన సభలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కనే వుండి ప్రసంగిస్తున్న పలమనేరు కాంగ్రెస్ అభ్యర్థి బి.శివశంకర్ ఆవేశంతో ఊగిపోతూ ఒక్కసారిగా వాహనం పైనుంచి కిందకు దూకేశారు. అటుపిమ్మట కిందఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు శివశంకర్‌ను మళ్లీ వాహనం పైకి ఎక్కించిన తరువాత శివశంకర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.

ముడా చైర్మన్ వల్ల ప్రాణహాని

పోలీసులకు అడ్వొకేట్ ఫిర్యాదు

పుంగనూరు, ఏప్రిల్ 15: ముడా చైర్మన్ ఎస్.వెంకటరెడ్డి యాదవ్, ఆయన అనుచరుల వల్ల తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని తెలుగు యువత నాయకుడు, అడ్వొకేట్ ఎల్.నవీన్ యాదవ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ముడా చైర్మన్ అనుచరులు ఫోన్లు చేసి దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని పుంగనూరు ఎస్ఐ రఫీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తే చంపేస్తామని, నీ వల్ల యాదవుల ఓట్లు పోతాయని, ఇప్పటికే టీడీపీలో తిరుగుతున్నావని, ఇన్నిసార్లు నీపై దాడులే చేశామని, ఇక నిన్ను చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. వెంకటరెడ్డి యాదవ్ డ్రైవర్ ప్రవీణ్‌చిన్నా 9182315923, 82975 76474, నడిమిగడదేశికి చెందిన రమేశ్ 93462 56631, కమతంపల్లెకి చెందిన ఎంపీటీసీ కొమ్మిరి వెంకటరమణ 70132 24362, 6301512791, కొత్తపల్లెకి చెందిన సాయిరెడ్డి 9844443485 ఫోన్ల నుంచి వెంకటరెడ్డి యాదవ్ చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని ఉందని వైసీపీ నాయకులు ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఆధారాలు అందజేశానని వివరించారు.

నా కుటుంబానికి రక్షణ కల్పించండి

బీజేపీ నేత డీజీపీకి ఫిర్యాదు

పుంగనూరు, ఏప్రిల్ 15: తన కుటుంబానికి వైసీపీ అరాచకశక్తుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు పుంగనూరు నియోజకవర్గ బీజేపీ కో-కన్వీనర్, అడ్వొకేట్ పూల ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 13వ తేది పుంగనూరు మున్సిపల్ కార్యాలయంలో తనపై వైసీపీ నాయకులు దాడిచేశారని, ఏటిగడ్డపాళ్యం గంగమ్మ ఆలయంపై దాడిచేసిన వారిపై కేసులు పెట్టాలని పోరాడగా మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం తనకు ఫోన్‌చేసి దుర్భాషలాడి బెదిరించాడన్నారు. పుంగనూరులో అక్రమ నిర్మాణాలపై ఆర్టీఐ ద్వారా వివరాలు కోరగా అంతు చూస్తామని బెదిరించారని, 2020లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికి బీజేపీ నాయకులతో కలిసి పులిచెర్లకు వెళ్లగా వైసీపీ శ్రేణులు కారు ధ్వంసం చేసి రక్తం వచ్చేలా కొట్టారన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టానని వైసీపీ కార్యకర్తలు తిట్టారని, కేసులు పెట్టారని చెప్పారు. పుంగనూరు జాతరలో తనపై దాడి చేయాలని కొందరు వెంబడించారని, పోలీసులు రౌడీషీట్ తెరవాలని పోలీస్‌స్టేషన్‌కు రావాలంటూ అర్ధరాత్రి దౌర్జన్యం చేశారన్నారు. తనకు, తన కుటుంబసభ్యులకు ప్రాణహాని ఉందని డీజీపీ, ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

యువత భవిష్యత్తు కోసం టీడీపీని ఆదరించాలి

మాజీ మంత్రి అమరనాథ రెడ్డి



టీడీపీలో చేరిన యువతతో అమరనాథరెడ్డి, ప్రసాదరావు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్15: రాష్ట్రంలో యువత ఉజ్వల భవిష్యత్తుకోసం టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి కోరారు. బైరెడ్డిపల్లెలో సోమవారం జరిగిన తెలుగు యువత ఆత్మీయ సమావేశానికి ఆయనతోపాటు చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరనాథరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో యువత కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. యువత భవిష్యత్తుకోసం ఆలోచించే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ టీడీపీ అండగా నిలబడడం హర్షణీమన్నారు. వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టీడీపీ ప్రభుత్వం యువత భవిష్యత్తుకోసం ఎంతో కృషి చేసిందన్నారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించే బాధ్యత యువతపైనే ఆధారపడివుందన్నారు. ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనేవుందని, యువత అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతోవుందన్నారు. రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో వుందన్నారు. ఈ సందర్భంగా చప్పిడిపల్లె పంచాయతీకి చెందిన కొందరు యువత టీడీపీలో చేరడంతో వారికి అమరనాథరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ జయకుమార్, తెలుగుయువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు, నాయకులు రాజేష్, సురేష్, చంద్ర, జనసేన నాయకులు పసుపులేటిదిలీప్, చైతన్యకుమార్, సల్మాన్, బీజేపీ నాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పలమనేరు : పలమనేరు మున్సిపల్ పరిధి గొబ్బిళ్ల కోటూరుకు చెందిన గణేష్ వైసీపీని వీడి సోమవారం తన అనుచరులు రెడ్డెప్ప, వాసుతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైభవంగా స్నపన తిరుమంజన సేవ

కార్వేటినగరం, ఏప్రిల్ 15: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి సోమవారం స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

● సీపీఐ కార్యదర్శి నాగరాజన్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 15: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సోమవారం బంగారుపాళ్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగరాజన్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రంలోని ఐదు కోట్ల మందిని నట్టేట ముంచిందని విమర్శించారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలిస్తామని మోదీ దగా చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగాలు కల్పిస్తారని ఆయన అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా, రైతులకు రుణమాఫీ, మహిళలకు ఆర్థిక సాయం, పేదలకు రూ.5లక్షలతో ఇంటి నిర్మాణానికి అందజేస్తారని తెలిపారు. చిత్తూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జగపతి బాబును, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.ఎస్. బాబును ఆశీర్వదించి గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రాజు, బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్న కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో ఘన స్వాగతం

కార్వేటినగరం: పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు కార్వేటినగరంలో సోమవారం ఘన స్వాగతం లభించింది. కార్వేటినగరం పోలీస్ స్టేషన్ వద్ద పీసీసీ అధికార ప్రతినిధి ఎం గోవర్ధన్ రెడ్డి, గంగాధరనెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రమేష్‌బాబు, షర్మిలకు క్రేన్ సహాయంతో గజమాలను వేశారు. పూలతో తయారుచేసిన టోపీని ఆమెకు బహూకరించారు. పోలీస్ స్టేషన్ వద్ద నుంచి గాండ్లమెట్ట కూడలి వద్దకు పుత్తూరు-చిత్తూరు జాతీయ రహదారి ఇరువైపులా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆమెకు స్వాగతం పలికారు. మిట్ట కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో షర్మిల మాట్లాడుతూ జీడీ నెల్లూరులో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా రమేష్‌బాబును గెలిపించాలని ఓటర్లను కోరారు. మామిడి పండ్ల గుజ్జు ఫ్యాక్టరీలు సిండికేట్‌గా తయారై మామిడి రైతాంగాన్ని దోపిడీ చేస్తున్నాయని ఒక రైతు షర్మిల దృష్టికి తీసుకువచ్చారు. కార్వేటినగరం సింగిల్ విండో మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్వేటినగరం అభివృద్ధి కాంగ్రెస్ పాలనలోనే జరిగిందని అన్నారు.


బంగారుపాళ్యంలో మాట్లాడుతున్న షర్మిల

చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత నాది

● ప్రణాళికను విడుదల చేసిన గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యతను తాను తీసుకుంటానని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై రూపొందించిన కరపత్రాలను ఉమ్మడి పార్టీ నేతలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం వంటి పనులతో పాటు నియోజకవర్గానికి అవసరమైన ముఖ్యమైన పనులు, వసతులను గుర్తించి, మూడు పార్టీల నేతలతో చర్చించి అభివృద్ధి ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు చేసి, విద్యాప్రమాణాలు మెరుగుపరచి, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలైన ఐఐటీ, నవోదయ, కేంద్రీయ విద్యా సంస్థల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. చిత్తూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చడంకోసం అసంపూర్తిగా ఉన్న అడవిపల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తామని, నగరాన్ని గ్రీన్ సిటీగా చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ ఇన్నర్ రింగ్ రోడ్డు ఏర్పాటు, ఇండస్ట్రియల్ హబ్, గుడిపాల మండలంలో గార్మెంట్స్, షూ కంపెనీలు ఏర్పాటు చేసి స్థానిక యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. నగరంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి, ప్రభుత్వాసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామన్నారు. పేదలకు పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లను పంపిణీ చేస్తామని చెప్పారు. మామిడి రైతులకు, పాడి రైతులకు మద్దతు ధర కల్పిస్తామని, సబ్సిడీతో దాణా అందిస్తామన్నారు. తేనెబండ నుంచి తోటపాళ్యం వరకు నీవానదికి ఇరువైపులా వరద ముంపునకు గురికాకుండా రక్షణ గోడ నిర్మాణం, కట్టమంచి చెరువు అభివృద్ధితో పాటు చిత్తూరు జిల్లాకు సేవలందించిన గొప్ప వ్యక్తుల విగ్రహాలు ఏర్పాటు చేసి మినీ ట్యాంక్‌బండ్ నిర్మిస్తామన్నారు. చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల మండల కేంద్రాల్లో ఉన్న ప్రభుత్వాస్పత్రులను 100 పడకల ఆస్పత్రులుగా ఆధునీకరిస్తామని పేర్కొన్నారు. తనను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు చంద్రప్రకాష్, బాలాజి నాయుడు, మోహన్‌రాజ్, సీఎం విజయ, సుబ్బానాయుడు, అత్తుబాయ్, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, చిట్టిబాబు, మోహన్ నాయుడు, జనసేన నేతలు ఆరణి కవిత, దయారాం తదితరులు పాల్గొన్నారు.


మ్యానిఫెస్టోను ప్రదర్శిస్తున్న గురజాల జగన్మోహన్ తదితరులు

నామినేషన్ పత్రాల్లో ఎవరేమిటో తెలుస్తుంది

ఎమ్మెల్యేగా నామినేషన్ వేసేటపుడు సమర్పించే బయోడేటాలో ఎవరేమిటో తెలుస్తుందని గురజాల అన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డిపై ఎన్ని కేసులున్నాయో, ఆయన సంపాదన ఎంతో, ఆయన ఎలాంటి వాడో ప్రజలు తెలుసుకుంటారన్నారు. కాగా ఇన్నాళ్లూ ఏపీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా ఉన్న చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానంద రెడ్డి నియోజకవర్గ పరిధిలో ఎన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించారో చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి తామేం చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్: టీడీపీ

గుడిపాల, ఏప్రిల్ 15: టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ కల్పించే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీలు బాలాజీ నాయుడు, సుమతి, సీనియర్ నేత చెన్నకేశవులు నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని వెప్పాలమానుచేనులో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు గుర్తింపు ఇచ్చిన వ్యక్తి చంద్రబాబు అని, ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వైసీపీకి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిత్తూరు పట్టణ బీసీసెల్ కార్యదర్శి రాధాక్రిష్ణ, టీడీపీ నాయకులు చిట్టి యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, సుధాకర్ యాదవ్, మోహన్ గౌడ్, కిట్టు, షణ్ముగం గౌండర్, రవి నాయుడు, త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు కూడా పన్ను వేసిన వైసీపీ ప్రభుత్వం

యాదమరి, ఏప్రిల్ 15: చెత్తకు కూడా పన్ను వేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ విమర్శించారు. జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని 184 గొల్లపల్లెలో బీసీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాధనాన్ని మింగేసిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు తిరిగి పోటీ చేస్తున్నారని ఆరోపించారు. వారెప్పుడైనా పూతలపట్టు సమస్యల గురించి అసెంబ్లీలో మాట్లాడారా అని ప్రశ్నించారు. మన సమస్యలను అసెంబ్లీలో మాట్లాడలేని వారు మనకు అవసరమా అని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించాల అన్నారు. అంతకు ముందు పెద్ద ఎత్తున బీసీలు మురళీ మోహన్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు దగ్గుమళ్ల సుధాకర్‌రావు, జయచంద్ర నాయుడు, వల్లేరు అమరనాథ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి రవి, జనసేన నాయకులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా

● కూటమి అభ్యర్థి మురళీమోహన్


35యర్లంపల్లెలో కరపత్రాలు పంచుతున్న మురళీమోహన్

ఐరాల, ఏప్రిల్ 15: అభివృద్ధే ధ్యేయంగా పని చేసి ప్రతి పేదవాడి కష్టాలు తీరుస్తానని పూతలపట్టు నియోజకవర్గ కూటమి అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. సోమవారం మండంలోని 35యర్లంపల్లె పంచాయతీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనకు అఖండ మెజారిటీ అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకులు జయచంద్రయ్య, వాసు, రవి, సందీప్, శేషాద్రి నాయుడు, రంజిత్‌రెడ్డి, లోకనాథరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రతాప్ నాయుడు, శ్రీధర్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీకి పట్టం కట్టండి

బంగారుపాళ్యం, ఏప్రిల్ 15: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని క్లస్టర్ ఇన్‌చార్జి ధరణీ నాయుడు, మాజీ జడ్పీటీసీ కళావతి, ఏపీ కల్లుగీత కార్మిక మాజీ డైరెక్టర్ మహేంద్ర అన్నారు. సోమవారం మండలంలోని సంక్రాంతిపల్లె పంచాయతీ నూనెగుండ్లపల్లి, మిట్టపల్లి, బేరిపల్లి, కరిపిరెడ్డిపల్లి, సంక్రాంతిపల్లి గ్రామాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘ కార్యదర్శి కుప్పాల మురళి, సర్పంచ్ రమేష్, నాగరత్నం, పెరుమాళ్, హరి, యుగంధర్, సూరి, సురేష్, బుజ్జి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


నిరుపేదలకు అన్నదానం చేస్తున్న ఎన్‌పీ సురేంద్ర నాయుడు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 15: మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ సురేంద్ర నాయుడు కుమార్తె భార్గవి, పవన్ కుమార్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధరణి నాయుడు, కమల్‌నాథ రెడ్డి, లోకనాథ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రమేష్, హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి: ఎస్పీ

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 15: రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి.ఎస్. మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్‌ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, కేసు డైరీ, క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ ఆరిఫుల్లా, నగరి డీఎస్పీ కె.ఎన్. మూర్తి, నగరి రూరల్ సీఐ సుబ్బరామిరెడ్డి, కార్వేటినగరం సీఐ సత్యబాబు, నలుగురు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్‌ఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

గెలిపిస్తే మరమగ్గ కార్మికులకు అండగా ఉంటా

- గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 15: సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపిస్తే మరమగ్గ కార్మికులకు అండగా ఉంటానని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. నగరి పట్టణంలోని ఏకాంబరకుప్పంలో సోమవారం భానుప్రకాష్ ఇంటింట ప్రచారం చేసి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక మరమగ్గ కార్మికులు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడమేగాక, విద్యుత్ ఛార్జీలు తగ్గించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నగరిని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు రజనీకాంత్, వరదరాజులు, నటరాజన్, శ్రీకాంత్, మోహన్, షణ్ముగం, ఇలంగోవన్, దయాలన్, ఆనంద్, నాగరాజు, తనిగవాసన్, కృష్ణ, తులసిలింగం, మురళి తదితరులు పాల్గొన్నారు.


ఏకాంబరకుప్పంలో కరపత్రం అందచేస్తున్న భానుప్రకాష్

రాక్షసపాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

నింద్ర, ఏప్రిల్ 15: రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందామని నింద్ర మండల టీడీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని ఎలకాటూరు దళితవాడ, మిట్టూరులో సూపర్‌సిక్స్ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరావు, కార్యదర్శి విజయ్ కుమార్ నాయకులు మోహన్ రెడ్డి, కుప్పారెడ్డి, వెంకట నరసింహులు, సంపూర్ణ నాగవేల్ రెడ్డి, నాగులయ్య, సంజీవి, తనికాచలం, వేదాచలం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 10 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న రుద్రయ్య నాయుడు

పెనుమూరు, ఏప్రిల్ 15: మండలంలోని గొబ్బిలమిట్ట, పాళ్యంకొత్తూరు గ్రామాల్లో దుర్వాసులు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, రాజగోపాల నాయుడు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. మండలంలోని చిప్పారపల్లి పంచాయతీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. రాబోవు ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేయాలని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు హరిబాబు నాయుడు, ఈశ్వర్ నాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, తలారిరెడెప్ప, సురేష్, ఆశోక్, బాలాజీ నాయుడు, గుర్రప్ప నాయుడు, తులసీ నాయుడు, ఏకంబరం, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇకపై కోడికత్తి డ్రామాలు ఎవరూ నమ్మరు

● టీడీపీ నాయకుల విమర్శ

నగరి, ఏప్రిల్ 15: జగన్‌మోహన్‌రెడ్డి గారూ.. ఇకపై మీ కోడికత్తి డ్రామాలు నమ్మేవారు ఎవరూ లేరని నగరి టీడీపీ నాయకులు పేర్కొన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విజయపురం టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో కోడికత్తి డ్రామాతో సానుభూతి పొంది విజయం సాధించినట్లే నేడు గులకరాయి దాడి పేరుతో నటిస్తున్నారని, ప్రజలెవరూ జగన్‌రెడ్డిని నమ్మేవారు లేరన్నారు. మా నాయకుడు చంద్రబాబుపై రాళ్లతో దాడి చేసినా చెక్కు చెదరని ఆత్మవిశ్వాసంతో ఆయన ప్రచారం చేస్తున్నారని, జగన్‌లాగా డ్రామాలు ఆడి ప్రతిపక్ష కుట్ర అంటూ సానుభూతి కోసం ప్రయత్నించలేదన్నారు. కార్యక్రమంలో విజయపురం మండల టీడీపీ కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు నారాయణ స్వామి నాయుడు, చిత్తూరు బాబు, మాజీసర్పంచి మణి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు కోడికత్తి... నేడు గులకరాయి డ్రామా

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15: నాడు కోడికత్తి... నేడు గులకరాయి డ్రామాలతో జగన్ ప్రజల్లో సానుభూతితో ఇంత దిగజారుడుతనంగా వ్యవహరించడం చూసి ప్రజలే నవ్వుకుంటున్నారని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయ నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి లాయర్ శరవణకుమార్, పార్లమెంట్ టీఎన్‌ఎస్‌ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు, పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరక్టర్ కామసాని విజయకుమార్‌రెడ్డి, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్‌అలీ, నియోజకవర్గ టీఎన్‌టీయుసీ ప్రధానకార్యదర్శి బోడిరెడ్డి రుషేంద్రరెడ్డిలు సోమవారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ప్రతిదానికి ప్రతిపక్షనేత చంద్రబాబుపై అభాండాలు వేయడం, చివరికి వైసీపీకి డ్రామాలు వెలుగులోకి వచ్చిన తర్వాత అభాసుపాలు అవుతున్నారని పేర్కొన్నారు.

వైసీపీ బెదిరింపులకు భయపడం: గురజాల

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 15: వైసీపీ ఆకురౌడీలకు భయపడేది లేదని చిత్తూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. సోమవారం చిత్తూరు రూరల్ మండలంలోని దిగువమాసాపల్లి, తాళంబేడు, అనంతాపురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ క్యాడర్‌ను వైసీపీ నేతలు మానసికంగా ఒత్తిడికి గురిచేస్తున్నారని తెలిపారు. తనను ఎదుర్కొనలేక... తన అనుచరులను ప్రలోభ పెడుతూ వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా చిత్తూరులో తాను గెలవడం ఖాయమన్నారు. 150 సీట్లతో కూటమి అధికారం చేపట్టడం ఖాయమని, అధికారంలోకి వచ్చాక వైసీపీ రౌడీల అంతుచూస్తానని హెచ్చరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్ మాట్లాడుతూ రౌడీ రాజ్యం పోవాలంటే కూటమిని గెలిపించాలని ప్రజలను కోరారు. మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మంజూష్, రఘు, జగదీష్ నాయుడు, దేవరాజులు నాయుడు, సామివేల్ తదితరులు పాల్గొన్నారు.


గురజాల, చంద్రప్రకాష్‌లకు హారతులు పడుతున్న మహిళలు

టీడీపీలో చేరిన 20 వైసీపీ కుటుంబాలు

చిత్తూరు రూరల్ మండలంలోని అయ్యప్పగారిపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వైసీపీకి చెందిన 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి గురజాల, చంద్రప్రకాష్‌లు పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. మండలంలోని దిగువమాసాపల్లి పంచాయతీలో టీడీపీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు.

అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం

గుడిపాల, ఏప్రిల్ 15: టీడీపీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి గురజాల ప్రతిమ, చిత్తూరు పార్లమెంటు ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు పీటర్ అన్నారు. సోమవారం మండలంలోని శ్రీరంగంపల్లి, చీలాపల్లి పంచాయతీలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

గురజాలను భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావును భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. సోమవారం నగరంలోని గురజాల జగన్మోహన్ నివాసంలో తెలుగు మహిళలు సమావేశం నిర్వహించారు. సమావేశంలో గురజాల సతీమణి ప్రతిమ మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే మహిళాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు


తెలుగు మహిళలతో ప్రతిమ

చంద్రబాబుపై రాళ్ల దాడి

- ఖండించిన తెలుగు మహిళలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15: చంద్రబాబుపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు రాళ్ల దాడికి పాల్పడటాన్ని చిత్తూరు పార్లమెంటు తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. చంద్రబాబుపై రాళ్లతో దాడి చేసినా ఆత్మవిశ్వాసంతో ప్రచారం చేస్తున్నారని, జగన్‌లాగా డ్రామాలు ఆడటం లేదన్నారు.

సురేంద్రకుమార్‌కు సన్మానం


సురేంద్రకుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న టీడీపీనేతలు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 15: రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధిగా కొత్తగా ఎంపికైన సురేంద్రకుమార్‌కు చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీనేతలు పలువురు శాలువకప్పి గజమాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, నేతలు కొత్తపల్లిమిట్ట సూరిరెడ్డి, కటికపల్లె వరదరాజులు, వెంకటేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

దళితులను అవమానించడం తగదు

చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 15: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళిత ఉద్యమ నాయకుల్ని అధికారులు అవమానపర్చడం సరికాదని దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు మునస్వామి, అధ్యక్షుడు ధనంజయరావు, వర్కింగ్ చైర్మన్ రాజ్‌కుమార్‌లు సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు ఎస్సీ, ఎస్టీలను మాట్లాడించకపోవడం దళిత వర్గాలను అవమానించడమేనన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆ ప్రకటనలో తెలిపారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన

నగరి, ఏప్రిల్ 15: నగరి మున్సిపాలిటీ పరిధిలోగల పోలింగ్‌బూత్‌లను నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తనిఖీ చేశారు. పోలింగ్‌బూత్‌లలో అన్ని సౌకర్యాలున్నాయా లేవా అని పరిశీలించారు. ఏమైనా పనులు అవసరమైతే యుద్ధప్రాతిపదికన చేపట్టాలని మున్సిపల్ డీఈ నరేష్‌కు సూచించారు.

నగరపాలక సంస్థలో ట్రేడ్ లైసెన్స్ ఫీజులో గోల్‌మాల్

● సుమారు రూ.2 కోట్లు స్వాహా ● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 15: చిత్తూరు నగరపాలకసంస్థలో పెద్దఎత్తున ట్రేడ్‌లైసెన్స్ రెన్యూవల్ ఫీజులో గోల్‌మాల్ జరిగిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నగరంలో సుమారు 2400 రిజిస్టర్ వ్యాపార సంస్థలున్నాయన్నారు. ఇవికాకుండా దాదాపు 2 వేలకు పైగా అనధికారికంగా వ్యాపారాలు చేసుకుంటున్నారని చెప్పారు. మునిసిపల్ కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్ పొందడానికి ప్రాపర్టీ టాక్స్, బిల్డింగ్ ప్లాన్, బ్లూప్రింట్, హెల్త్ ఆఫీసర్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్, ప్రజాభిప్రాయం, చలానా తదితర డాక్యుమెంట్లు పొందుపరచాల్సి ఉంటుందన్నారు. కాని పై తెలిపిన డాక్యుమెంట్లు లేకపోయినా వాటిని సాకుగాచూపి పెద్ద ఎత్తున లంచాలు వసూలు చేసి ట్రేడ్ లైసెన్స్‌లు ఇస్తున్నారన్నారని ఆరోపించారు. ఈ ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చేటపుడే వ్యాపారస్తుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఆఫీసర్లు, మునిపల్ కమిషనర్ దాకా పెద్దఎత్తున లంచాలు ముట్టజెప్పుకోవాల్సి వస్తోందని ఆరోపించారు. అలాగే క్షేత్ర స్థాయిలో కొంతమంది నగరపాలక సిబ్బంది వ్యాపారస్తుల నుంచి ట్రేడ్ లైసెన్స్‌ను నగదు రూపంలో వసూలు చేసి వాటిని తమ సొంత జేబుల్లోకి మళ్లిస్తున్నారని చెప్పారు. ఇలా సుమారు రూ.2 కోట్ల రూపాయల వరకు స్వాహా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్‌కు లేఖ రాశామని చెప్పారు. నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, బాబు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌పై వచ్చిన ఆరోపణలు నిరాధారం

- అనిల్ కుమార్, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్

ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్‌లో రూ.2 కోట్లు స్వాహా అని వస్తున్న ఆరోపణల్లో నిజంలేదు. 2016 నుంచి ట్రేడ్ లైసెన్స్‌లను ఆన్‌లైన్ చేయడం జరిగింది. 2020 నుంచి వార్డు సచివాలయాల ద్వారా ఇతర సర్వీసులమాదిరి ట్రేడ్ లైసెన్సుల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ప్రాసెస్ చేయబడతాయి. ఆన్‌లైన్‌లో డిమాండ్ జనరేట్ అయిన తర్వాత డిమాండ్ నోటీసు లైసెన్స్ దారులకు అందజేయడం జరుగుతుంది. డిమాండ్ నోటీసులో ఉన్న మేరకు సదరు లైసెన్స్ దారుడు నగదును నగరపాలక సంస్థ కౌంటర్‌లో చెల్లించి రశీదు పొందుతారు. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావులేదు. ఈ ఏడాది రూ.53,99,347 మాత్రమే ట్రేడ్ లైసెన్స్ చెల్లింపులు జరిగాయి. రూ.2 కోట్లు స్వాహా జరిగిందన్న ఆరోపణ అవాస్తవం.

ముడా చైర్మన్ వల్ల ప్రాణహాని

- పోలీసులకు అడ్వొకేట్ ఫిర్యాదు

పుంగనూరు, ఏప్రిల్ 15: ముడా చైర్మన్ ఎన్.వెంకటరెడ్డి యాదవ్, ఆయన అనుచరుల వల్ల తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని తెలుగు యువత నాయకుడు, అడ్వొకేట్ ఎల్.నవీన్ యాదవ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నవీన్ మాట్లాడుతూ ముడా చైర్మన్ అనుచరులు ఫోన్లు చేసి దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని పుంగనూరు ఎస్‌ఐ రఫీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీకి మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తే చంపేస్తామని, నీ వల్ల యాదవుల ఓట్లు పోతాయని, ఇప్పటికే టీడీపీలో తిరుగుతున్నావని, ఇన్నిసార్లు నీపై దాడులే చేశామని, ఇక నిన్ను చంపేస్తామని బెదిరించినట్లు తెలిపారు. వెంకటరెడ్డి యాదవ్ డ్రైవర్ ప్రవీణ్‌చిన్నా 9182315923, 82975 76474, నడిమిగడదేశికి చెందిన రమేశ్ 93462 56631, కమతంపల్లెకి చెందిన ఎంపీటీసీ కొమ్మిరి వెంకటరమణ 70132 24362, 6301512791, కొత్తపల్లెకి చెందిన సాయిరెడ్డి 9844443485 ఫోన్ల నుంచి వెంకటరెడ్డి యాదవ్ చంపేస్తామని బెదిరిస్తున్నారని, తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని వైసీపీ నాయకులు ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసి ఆధారాలు అందజేశానని వివరించారు.

ధ్వజారోహణంతో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 15: నగరంలోని కోదండ రామాలయంలో సోమవారం స్వామి వారి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు గోపాల్ బృందం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం సింహ వాహన సేవ నిర్వహించారు.

సదుం: మండలంలోని అమ్మగారిపల్లె పంచాయతీ పలకటివారిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రాణప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహించారు.

ఎం.బండపల్లిలో క్రికెట్ టోర్నమెంటు

పూతలపట్టు, ఏప్రిల్ 15: మండలంలోని ఎం. బండపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ టోర్నమెంట్ క్లబ్ ఆధ్వర్యంలో మే 4వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంటు జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంటులో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.33,333, రెండో బహుమతిగా రూ.22,222, మూడో బహుమతిగా రూ.11,111 అందజేయనున్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు ఈనెల 25వ తేదీ లోగా రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 62811 36702, 90143 37973, 79893 24848 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి

పెనుమూరు, ఏప్రిల్ 15: ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పెనుమూరు ఎస్‌ఐ లోకేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన కేంద్ర బలగాలతో పెనుమూరు, కె.సి. పల్లి పంచాయతీల్లో కవాతు నిర్వహించారు.


పెనుమూరులో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు